AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

21-5-2026 (Thursday) MAIN EDITION

## చంద్రబాబుపై జగన్ సంచలన వ్యాఖ్యలు




**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హరికృష్ణ చనిపోతే పరామర్శకు వెళ్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పొత్తుల గురించి చంద్రబాబు మాట్లాడారని ఆరోపించారు. శవాన్ని పక్కనపెట్టుకొని పొత్తుల గురించి మాట్లాడిన నీది శవ రాజకీయం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఎవరైనా ఏదైనా అంశం మీద ప్రశ్నిస్తే.. తన మీద, వైసీపీ మీద అడ్డగోలుగా ఆరోపణలు చేసి టాపిక్ డైవర్ట్ చేస్తారన్నారు. ఇటీవల చంద్రబాబు బీపీ పెరగడానికి మావిగన్ కారణమన్నారు.

## జగన్ బటన్లు నొక్కారు తప్ప చేసిందేం లేదు..: బాలినేని



**అక్షరటుడే, అమరావతి:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవర్తనపై మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. జగన్ కేవలం బటన్లు నొక్కడానికే పరిమితమయ్యారని, ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని మండిపడ్డారు. రాజధాని ఏర్పాటు విషయంలో జగన్‌తో పాటు సజ్జల రామకృష్ణారెడ్డికి కూడా తాను ముందే సలహాలు ఇచ్చానని బాలినేని గుర్తుచేశారు. నాగార్జున యూనివర్సిటీ పరిసరాల్లో రాజధానిని నిర్మిస్తే బాగుంటుందని ఆనాడే చెప్పినప్పటికీ.. జగన్ తన మాటను పట్టించుకోలేదన్నారు.

## కూకట్‌పల్లిలో కారు బీభత్సం



అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని వివేకానంద నగర్ సమీపంలో ఒక కారు బీభత్సం సృష్టించింది. వివేకానంద నగర్ ఆర్చ్ నుంచి అల్విన్ కాలనీ వైపు అతివేగంగా ప్రయాణిస్తున్న ఒక ఎలక్ట్రిక్ కారు, పలు ద్విచక్ర వాహనాలు, కార్లను ఢీకొట్టింది. చివరకు ఓ టిఫిన్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది.

## బెంగాల్‌లోని ఫాల్టాలో రీపోలింగ్



అక్షరటుడే, కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో గల ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో రీపోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, ఈరోజు సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ఓటర్లు భారీగా తరలివచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు. కాగా.. మే 24న ఫలితాలు రానున్నాయి.


## ఎబోలాపై అలర్ట్ జారీ చేసిన ఢిల్లీ విమానాశ్రయం



అక్షరటుడే, ఢిల్లీ: అంతర్జాతీయ ప్రయాణికులకు ఢిల్లీ విమానాశ్రయం సలహా జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే లేదా ఆ దేశాల గుండా ప్రయాణించే ప్రయాణికుల కోసం ఆరోగ్య సలహాను జారీ చేసింది. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా నియమాలను పాటించాలని సూచించారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ..

### రేపటి వరకు క్యూలైన్లకు రావొద్దని విజ్ఞప్తి



**అక్షరటుడే, తిరుమల:** వేసవి సెలవుల కారణంగా తిరుమలకు భక్తులు భారీగా పోటెత్తారు. వైకుంఠం కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోవడంతో సర్వదర్శనానికి 24 గంటలకు పైగా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు శుక్రవారం ఉదయం 6 గంటల వరకు క్యూలైన్లలోకి రావద్దని టీటీడీ అధికారులు అత్యవసర ప్రకటన విడుదల చేశారు.



## విశాఖలో మూడు ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**అక్షరటుడే, విశాఖ:** విశాఖపట్నం నగరంలో మౌలిక వసతుల ఆధునీకరణ, పట్టణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 1,501.03 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించిన మూడు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద ఈ నిధులు విడుదల కానున్నాయి. ఈ నిధులలో అత్యధికంగా రూ. 725.18 కోట్లను మధురవాడ జోన్‌లో అత్యాధునిక స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు కోసం కేటాయించారు.

రాష్ట్రంలోని కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుడ్‌న్యూస్ చెప్పారు. కనీస వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. కేబినెట్ సబ్‌కమిటీ నివేదిక మేరకు రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించి.. కనీస వేతనాలను పెంచుతున్నట్లు తెలిపారు. దీంతో తెలంగాణలోని 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. సచివాలయంలో గురువారం సీఎం మీడియాతో మాట్లాడారు. - అక్షరటుడే, హైదరాబాద్



# కార్మికుల వేతనాలు పెంపు

### జూన్ 1 నుంచి కొత్త వేతనాలు

రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. జోన్ 1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ. 17 వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.13,772 నుంచి రూ.18,500కి, హైస్కిల్డ్ కార్మికుల వేతనం రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

**జూన్ 1 నుంచి అమలులోకి..**

కార్మికుల కనీస వేతనాలు పెంపు జూన్ 1 నుంచి అమలులోకి వస్తుందని సీఎం తెలిపారు. కార్మికుల హక్కులను కాపాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కార్మిక నాయకుడు అంటే కాక అని గుర్తు చేశారు. ఆయన కుమారుడు వివేక్ నేడు కార్మిక శాఖ మంత్రిగా ఉండటం గర్వకారణమన్నారు.

**ధాన్యం కొనుగోళ్లపై..**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై సీఎం మాట్లాడారు.

### తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

ఇంకా 20శాతం ధాన్యం మాత్రమే కొనాల్సి ఉందన్నారు. మిగతా అంత కొనుగోలు చేశామని చెప్పారు. 72 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్‌లో ఎన్నికలు ఉండడంతో హమాలీలు ఆలస్యంగా వచ్చారని చెప్పారు. దీంతో కొనుగోళ్లలో జాప్యం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోళ్లపై లెక్క తేలుద్దామని సవాల్ చేశారు.

**బాలికను అడ్డు పెట్టుకొని..**

కేటీఆర్ మనిషేనా.. అమ్మాయి ఫొటోలు బయటకు ఇస్తారా అని సీఎం ఆగ్రహం వ్యక్తం చే1శారు. బాలికను అమ్మాయిని అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేస్తారా.. ఇదేం శాడిజం అని మండిపడ్డారు. కేటీఆర్ బావమరిది డ్రగ్స్‌తో దొరికితే నోటీసు ఇచ్చామని, బండి భగీరథ్‌కు కూడా నోటీసులు ఇచ్చామన్నారు. కేటీఆర్‌కు బండి సంజయ్‌కి ఏదో పంచాయతీ ఉందని, దానిని పిల్లల మీద పెట్టి, కేటీఆర్ తీర్చుకోవాలి అనుకుంటున్నారని ఆరోపించారు. కేటీఆర్ బావమరిది ఫామ్ హౌజ్‌లో డ్రగ్స్ తీసుకుంటూ దొరికితే పోలీసులు

### భగీరథ్‌ను అరెస్ట్ చేశాం: సీఎం

చర్యలు తీసుకోవాలని ఎందుకు చెప్పలేదని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఫామ్ హౌజ్‌లో డ్రగ్స్ తీసుకుంటూ, పోలీసులపై కాల్పులు జరుపుతూ చిక్కాడని గుర్తు చేశారు. ఆయనను బీఆర్ఎస్ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదన్నారు.

**బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశాం**

బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశామని సీఎం తెలిపారు. పోలీసులు చెప్పిందే తాము చెప్తున్నట్లు పేర్కొన్నారు.. అప్పగిస్తే ఇంట్లోనో.. పోలీస్‌స్టేషన్‌లోనో అప్పగిస్తారని, రోడ్డు మధ్యలో కస్టడీలోకి తీసుకుంటే లొంగుబాటు అంటారా అని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ వద్ద భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కేసులో కేటీఆర్ జడ్జిగా.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐవోగా చేస్తున్నట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. భగీరథ్‌పై ఫిర్యాదు రాగానే పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నారని తెలిపారు.

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ..



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో వరి ధాన్యం కొనుగోళ్లలో నెలకొన్న తీవ్ర సంక్షోభం, కొనుగోలు కేంద్రాల వద్ద రైతాంగం పడుతున్న నరకయాతనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక సుదీర్ఘ బహిరంగ లేఖ రాశారు. గత రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు అష్టకష్టాలు పడుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేకపోవడంపై నిప్పులు చెరిగారు. ఎల్లుండి (మే 23) జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతలకు తక్షణమే న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ హయాంలో కొండంత ఆత్మవిశ్వాసంతో గుండె నిబ్బరంగా బతికిన తెలంగాణ రైతు.. నేడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాల సకల కష్టాలు తీరిపోయాయని సంబరంగా సాగు చేసుకుంటున్న రైతు నోట్లో ఈ సర్కార్ మట్టి కొట్టిందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ రైతులకు రక్షణగా అమలు చేసిన ఒక్కో అద్భుత పథకానికి ఈ ముప్పై నెలల కాలంలో పాతరేసి, తమ చేతకానితనంతో అన్నదాతల వెన్నువిరిచారని మండిపడ్డారు.

## నష్టాలతో ముగిసిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ స్వల్ప నష్టాలతో ముగిసింది. గురువారం లాభాలతో ప్రారంభమై భారీ లాభాల దిశగా సాగినా.. కొద్ది సేపటికే ప్రాఫిట్ బుకింగ్‌ను చూసింది. కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభిస్తుండగా.. గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తుండడంతో చివరికి సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. రూపాయిని స్థిరీకరించడానికి ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో సహా వివిధ చర్యలను పరిశీలిస్తోందన్న వార్తలతో ప్రారంభ లాభాలు ఆవిరయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 414 పాయింట్ల లాభంతో ప్రారంభమై మరో 213 పాయింట్లు పెరిగింది. అక్కడినుంచి 949 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 171 పాయింట్ల లాభంతో ప్రారంభమై మరో 29 పాయింట్లు ఎగబాకింది. అక్కడినుంచి 263 పాయింట్లు పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 135 పాయింట్ల నష్టంతో 75,183 వద్ద, నిఫ్టీ 4 పాయింట్ల నష్టంతో 23,654 వద్ద స్థిరపడ్డాయి.

## హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో గురువారం ఉదయం మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పాతబస్తీలోని మదీనా 'ఎక్స్' రోడ్డు వద్ద ఉన్న ఒక పిల్లల వస్త్ర దుకాణంలో భారీగా మంటలు చెలరేగాయి. ఓల్డ్ సిటీలో రద్దీగా ఉండే మదీనా కూడలి సమీపంలో ఉన్న ఒక ప్రముఖ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్ని మాపక సిబ్బంది 8 ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేసుకొని పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

## తమిళనాడు మంత్రివర్గ విస్తరణ..




**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంత్రివర్గాన్ని విస్తరించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి రెండు మంత్రి పదవులు ఇచ్చారు. అయితే రాష్ట్రంలో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేయడం గమనార్హం. ప్రమాణ స్వీకారం చేసిన రెండు వారాల తర్వాత ముఖ్యమంత్రి విజయ్ గురువారం తన మంత్రివర్గాన్ని విస్తరించారు. 23 మంది ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మంత్రివర్గంలో చేరిన వారిలో సేలం సౌత్ ఎమ్మెల్యే తమిళ పార్థిబన్, అరంతంగి ఎమ్మెల్యే జె మహమ్మద్ ఫర్వాస్ అలియాస్ పర్వేజ్, కోయంబత్తూరు నార్త్ ఎమ్మెల్యే వి సంపత్ కుమార్, కాంచీపురం ఎమ్మెల్యే ఆర్ వి రంజిత్ కుమార్, తాంబరం ఎమ్మెల్యే డి శరత్ కుమార్, తిరుప్పూర్ నార్త్ ఎమ్మెల్యే వి సత్యభామ, ఆర్ కె నగర్ ఎమ్మెల్యే మేరీ విల్సన్ ఉన్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత తమిళనాడు మంత్రివర్గంలోకి కాంగ్రెస్ కూడా ప్రవేశించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి విశ్వనాథన్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

## సరస్వతి నది అంత్య పుష్కరాలు ప్రారంభం



**అక్షరటుడే, భూపాలపల్లి :** సరస్వతి నది అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం 5.43 గంటలకు పుష్కరాలను ప్రారంభించారు. కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి పుష్కరాలను 12 ఏళ్లకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. గతేడాది మే 15 నుంచి మే 26 వరకు పుష్కరాలు నిర్వహించారు. అయితే తాజాగా అంత్యపుష్కరాలను మంత్రులు ప్రారంభించారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ, ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు శ్రీ గోవింద హరి తదితరులు పుణ్యస్నానాలు ఆచరించి పుష్కరాలను ప్రారంభించారు. భూపాలపల్లి, రంగారెడ్డి ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

## బుట్టబొమ్మకు ఎంగేజ్మెంట్ అయిందా..?



పూజ హెగ్డే మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కొన్ని ఫొటోలు, వీడియోలతో ఈ బ్యూటీ సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకుందా? అనే సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. పూజా తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఇటీవల షేర్ చేసిన ఒక వీడియోలో ఆమె చేతికి ప్రత్యేకంగా కనిపించిన రింగ్ కనిపించింది. అదే సమయంలో కొంతకాలంగా బాలీవుడ్ నటుడు రోహన్ మెహ్రాతో ఆమె సన్నిహితంగా కనిపించడం కూడా రూమర్స్‌కు మరింత బలం చేకూర్చింది. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు పూజా హెగ్డే నుంచి అధికారిక స్పందన రాలేదు. అసలు నిజం ఏంటన్నది మాత్రం అధికారిక క్లారిటీ వచ్చే వరకు సస్పెన్స్‌గానే ఉండనుంది.

—అక్షరటుడే, సినిమాడెస్క్